ప్రజాశక్తి

గురువారం 25 సెప్టెంబర్ 2025   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ప్రైవేటు ఆస్పత్రులకూ భారీగా

- ఆందోళన కలిగిస్తున్న అతిసార
- యుపిహెచ్‌సిలలోనూ కేసుల నమోదు
- పూర్తి స్థాయిలో వెల్లడికాని బాధితుల వివరాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమైన అతిసార బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నివారణ చర్యలు చేపడుతున్నామని, పరిస్థితి అదుపులో ఉందని అధికారులు చెబుతున్నా రోజురోజుకీ కేసుల సంఖ్య పెరగటం ఆందోళన కలిగిస్తోంది. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలోనూ కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారి వివరాలపై స్పష్టత లేదు. గుంటూరు నగరంలో బుధవారం ఒక్కరోజే సుమారు 50 కేసులు నమోదైనట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం జిజిహెచ్‌లో నమోదైన 17 కేసులనే ప్రకటించింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని యుపిహెచ్‌సిలలోనూ కేసులు నమోదవుతున్నాయి. ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 185 కేసులు నమోదవగా 104 మంది చికిత్స తీసుకుంటున్నారు. 81 మంది డిశ్చార్జ్ అయ్యారు.

అతిసార ప్రబలిన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ 50 బృందాలతో సర్వే చేపట్టి 3202 గృహాలను సర్వే చేసింది. ఈ సర్వేలో 11 మంది అతిసార, 4గురు జ్వరపీడితులను గుర్తించినట్లు డిఎంహెచ్ఒ ప్రకటించారు. తాగునీటి నమూనాలు సేకరించి, పరీక్షించటం, పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నా, కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంది. పారిశుధ్యం దిగజారింది. రోజులతరబడి కుంటల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరుగుతున్నాయి. అధిక వర్షాల నేపథ్యంలో తాగునీటి విషయంలో, పారిశుధ్యం విషయంలో ముందుస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు అంటున్నారు. అతిసార ప్రబలిన ప్రాంతాలన్నీ పాతగుంటూరులోనే ఉన్నాయి.

ప్రగతి నగర్‌లో కిట్లు పంపిణీ...

అతిసార ప్రబలిన ప్రగతి నగర్‌లో జిఎంసి సిద్ధం చేసిన వెయ్యి కిట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిఎంసి మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ బుధవారం పంపిణీ చేశారు. కిట్‌లో హ్యాండ్‌వాష్, లై బాయ్ సబ్బు, ఓఆర్ఎస్, ఫినాయిల్, న్యాప్‌కిన్ ఉన్నాయి. అనంతరం యాదవబజార్‌లోని శ్రీకష్ణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని, మెడికల్ కిట్లను పరిశీలించారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నవారి ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. డయేరియాపై ప్రజలు అపోహలకు గురికావొద్దని, కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటూ, ఇంటిలో తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. డయేరియా కేసులు నమోదైన ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా పరిగణించి, ఇంటింటికి యాక్టివ్ సర్వెలెన్స్ చేయడం, మెరుగైన పారిశుధ్య పనులు, రక్షిత నీటి సరఫరాల కోసం జిల్లా అధికారులను ఒక్కో వార్డుకు విధులు కేటాయించామని తెలిపారు. ప్రగతి నగర్‌లో బయో టాయ్‌లెట్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లను మరో 15 రోజులు కొనసాగించాలని కలెక్టర్‌ను మేయర్ కోరారు.

పాస్‌లు తీసుకోవటానికి వచ్చిన అభ్యర్థులు

నేడు డిఎస్సీ నియామకపత్రాలు

అభ్యర్థులకు పాస్‌లు జారీ - భర్తీ కానున్న 1124 ఖాళీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఎదురు చూపులకు నేటితో తెరపడనుంది. మెగా డిఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేడు ప్రభుత్వం నియామకపత్రాలు అందజేయనుంది. నియామక పత్రాల తర్వాత దసరా సెలవులలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శిక్షణలోనే సబ్జెక్టుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలల కేటాయిస్తారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరేలా ప్రణాళిక రూపొందించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన 1124 పోస్టులు భర్తీ కానున్నాయి. నోటిఫికేషన్‌లో 1143 పోస్టులు ప్రకటించినా, ఫలితాలు విడుదలైన తర్వాత జరిగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో తగిన రిజర్వేషన్ అభ్యర్థులు లేకపోవటంతో 19 పోస్టుల భర్తీని నిలిపివేశారు. మిగిలిన వాటిని భర్తీ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు అభ్యర్థితోపాటు, కుటుంబ సభ్యులు ఒకరికి పాస్‌లు జారీ చేశారు. గుంటూరు, పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిమ్ కాలేజీలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్య ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి, డిఇఒ సి.వి.రేణుక, ఇతర అధికారులు పర్యవేక్షించారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు వేలాది మంది రావటంతో కోలాహలంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని 1124 పోస్టులతోపాటు, జోనల్ స్థాయి పోస్టులకు ఎంపికైన మరో 526 మందికి కూడా ఇక్కడే పాస్‌లు ▶ 2లో

మంగళగిరిలో నిరసన

పని గంటల పెంపుపై ఆగ్రహం

పలు ప్రాంతాల్లో కార్మిక, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి రూరల్, గుంటూరు

పని గంటలు పెంచుతూ శ్రామిక వర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని వామపక్ష పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. పనిగంటల పెంపుని నిరసిస్తూ బుధవారం జిల్లాలోని పలుచోట్ల బుధవారం నిరసనలు చేపట్టారు. మంగళగిరిలోని పాతబస్టాండు వద్ద ఎఐటియుసి, సిఐటియు, సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలపగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. గుంటూరు నగరంలోని ఆటో నగర్ వంద అడుగుల రోడ్డులో కార్మికులు ఆందోళన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తోపాటు ఇతర నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక వర్గాన్ని అణగదొక్కుతున్నాయని అన్నారు. 139 సంవత్సరాలుగా అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించిన ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచడం కార్మిక హక్కులపై దాడి అని మండిపడ్డారు. మహిళలకు పగలే రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు వారిని రాత్రి పూట పనుల్లో పెట్టేలా ▶ 2లో

యుటిఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరులో గురువారం జరగనున్న రణభేరి సభకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి ఉపాధ్యాయులు తరలివస్తున్నారు. ఏర్పాట్లపై శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణంలో ఏర్పాట్లను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు బుధవారం పరిశీలించారు.

పట్టపగలే దారుణ హత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టపగలే దారుణ హత్యతో సత్తెనపల్లి పట్టణం ఉలిక్కిపడింది. గురువారం జరిగిన ఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కంబాలబావి వద్ద నివాసం ఉంటున్న ఆదాంషఫీ కుమార్తె అయిన అయిషాతో అదే వార్డుకు చెందిన కార్డు డ్రైవర్ ▶ 2లో

కొలనుకొండ వద్ద రైతులు కొట్టిన గండిని పరిశీలిస్తున్న మధు, సిపిఎం నాయకులు

రైతుల్ని దెబ్బతీస్తున్న ముంపు

ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి : మాజీ ఎంపి మధు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

అధిక వర్షాల సందర్భంలో పొలాలు ముంపుబారిన పడకుండా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామాల పరిధిలోని ముంపు పొలాలను ఆయన సిపిఎం నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ డ్రెయినేజీ బోర్డు నిర్లక్ష్యం వల్ల కొలనుకొండ, వడ్డేశ్వరం, గుండిమెడ, మెల్లంపూడి, కుంచనపల్లి గ్రామాల్లో పొలాలు నీట మునిగాయని, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంట చేతికందే సమయంలో ఈ పరిస్థితి రైతుల్ని తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు. భారీ వానల వల్ల ఇటీవల కాలంలో అనేకసార్లు వందల ఎకరాల పంటలు నీట మునిగాయని గుర్తు చేశారు. కుంచనపల్లి గ్రామం అపర్ణ అపార్ట్మెంట్ వద్ద నుండి ప్రాతూరు, కుంచనపల్లి మీదుగా గుండిమెడ, మెల్లంపూడి, వడ్డేశ్వరం కొలనుకొండ కెఎల్‌యు వరకు ఉన్న పొలాల డ్రెయినేజీ కాల్వ శుభ్రం చేయక, పూడుకు పోవడం వల్ల ముంపు సమస్య వచ్చిందని వివరించారు. 1996 ప్రాంతంలో అప్పటి సిపిఎం ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు... పొలాల్లోని నీరు బయటకు పోవడానికి వీలుగా పంట కాల్వలను శుభ్రం చేయించారని, ▶ 2లో

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసలుతో కలిసి నగరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై వైద్య ఆరోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ, డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో నియమించిన ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసులు నమోదు అవుతున్న 9 సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టితో ముందస్తు నివారణ చర్యలు అమలు చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని వెంటనే వైద్య శిబిరాలకు తరలించి, చికిత్స అందించాలన్నారు. గురువారం ఉదయం నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పానీపూరి సెంటర్లను మూసివేయించాలన్నారు. ఆర్ఒ ప్లాంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యాని సెంటర్లలో శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపాలన్నారు. నిర్దేశిత ప్రమాణాలు లేని దుకాణాలు మూయించాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్‌లో అతిసార

అప్రమత్తమైన వైద్య సిబ్బంది - సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని, ప్రకాష్ నగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో బాలుడు అతిసారా లక్షణాలతో మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది తెలిసిన స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు మానస మంజరి ఆ ప్రాంతంలో వైద్య బృదంతో సర్వే చేయించారు. కాలనీలో పరిస్థితి సాధారణంగానే ఉందని, అనుకోని ఇబ్బందు లొస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని డాక్టర్ మానస మంజరి చెప్పారు. పెనుమాక గ్రామానికి చెందిన మరో మహిళ కూడా అతిసార లక్షణాలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందు తున్నారు.

సిపిఎం నాయకుల పర్యటన

ప్రకాష్ నగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో అతిసార నమోదైన ప్రాంతంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, బి.దుర్గారావు పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి -నాదెండ్ల

జూదమాడుతున్న 6గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నామని నాదెండ్ల పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్ల గ్రామంలోని చలం కొండకు వెళ్ళే దారిలో ఉన్న ఓ గోడౌన్ షెడ్డులో జూదమాడుతున్న సమాచారంతో మెరుపుదాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుండి రూ.15,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి గాయాలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక సుల్తానాబాద్ సుందరయ్య నగర్‌కు చెందిన బాలుడు బ్లెస్సింగ్ పాల్ (9) కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి ఇంటి వద్ద బాలుడు ఆడుకుంటుండగా రోడ్డుపై తెగిపడి ఉన్న 12కెవి హైటెన్షన్ వైర్ తగిలి షాక్‌నకు గురైనట్లు స్థానికులు తెలిపారు. కరెంట్ షాక్ కారణంగా శరీరం కాలిపోవడంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబీకులు చేర్చారు. అక్కడ నుంచి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ కు తరలించినట్లు తెలిసింది.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బాలాజీరావుపేట నుంచి రైల్వే స్టేషను వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 70 ఏళ్ల వయసున్న ఆ వృద్ధుడు బిక్షాటన చేసుకుంటూ ఇక్కడే నివసిస్తున్నాడని స్థానికులు వెల్లడించారు. అనారోగ్యంతో మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనచోరుల ముఠా అరెస్టు

పది ద్విచక్ర వాహనాలు, ఒక కెటిఎమ్ స్పోర్ట్స్ బైక్ స్వాధీనం

చోరీ వాహనాలను కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టుకున్నా వారిపై కూడా కేసులు నమోదు

రూరల్ సిఐ, ఎస్ఐలు వై.శ్రీనివాసరావు, చిరుమామిళ్ల వెంకట్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి పోలీసు స్టేషన్ పరిధిలో వరుసగా జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులను మంగళగిరి గ్రామీణ సీఐ వై శ్రీనివాసరావు, గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ ఛేదించారు. బుధవారం మంగళగిరి గ్రామీణ పోలీస్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఆఫీసులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బైక్ చోరీలు చేసిన నిందితుల వివరాలను గ్రామీణ సిఐవై శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్‌లు వెల్లడించారు. దొంగలించిన పది బైకులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులు, వీరిలో మైనర్ బాలురు కూడా ఉన్నారు. వారందరినీ గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి స్వాధీనం చేసిన వాహనాల్లో ఒక కేటిఎమ్ స్పోర్ట్స్ బైక్ కూడా ఉండటం విశేషం. దొంగల గ్యాంగ్‌లో ప్రధాన నిందితులు లేళ్ల పవన్ తేజ ఏ క్రాంతి తేజ ఏ పవన్, తేజావత్ ప్రకాష్, పెడల అంకమ్మరాజు ఏ రాజు, ఇసుకుపల్లి కీర్తి దాసు కాగా, వీరితో పాటు తుళ్లూరు గ్రామానికి చెందిన ముగ్గురు చట్టంతో సంఘర్షణ పడుతున్న బాలురు కూడా ఉన్నారు. ప్రధాన నిందితుడు లేళ్ల పవన్ తేజ తుళ్లూరులోని టిడ్కో గృహాలలో నివసిస్తూ మిత్రులతో కలిసి దొంగతనాలు చేస్తున్నాడు. రౌడీ షీటర్‌గా గుర్తింపు పొందిన ఇసుకుపల్లి కీర్తి రాజు దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేసి రిసీవర్‌గా వ్యవహరించాడని పోలీసులు వెల్లడించారు. నవులూరు గ్రామానికి చెందిన మర్రి దుర్గ నాగ మల్లేశ్వరరావు ఇంటి ముందు పార్క్ చేసిన కేటిఎమ్ బైక్‌ను ఆగస్టు 22వ తేదీ రాత్రి దొంగలు అపహరించడంతో కేసు నమోదు అయ్యింది. విచారణలో బయటపడ్డ వివరాల ప్రకారం, నిందితులు చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదిం చాలనే ఉద్దేశంతో మోటార్ సైకిళ్లను దొంగిలించి నంబర్ ప్లేట్ మార్చి వాడుకోవడం, అమ్మేయడం లేదా తాకట్టు పెట్టడం చేసేవారని తెలిసింది. మంగళగిరి మండలంలోని ఆత్మకూరు, నవులూరు, నిడమర్రు, చినకాకాని, ఎర్రబాలెం గ్రామాల్లో తాళం వేసి ఉన్న వాహనాలను ఎంచుకొని దొంగతనం చేసినట్లు దర్యాప్తులో తేలింది. దొంగలించిన వాహనాలను కొనుగోలు చేసిన వారు, తాకట్టు పెట్టుకున్న వారిపైనా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సిఐవై శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో మంగళగిరి రూరల్ హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, ఏఎస్ఐ రత్నరాజు, హెడ్ కానిస్టేబుల్ రాము, చలమురావు, కానిస్టేబుల్ సాగర్ పాల్గొన్నారు.

నేడు డిఎస్సీ నియామకపత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. అభ్యర్థులు గురువారం ఉదయం 7 గంటలకు ఆంధ్రా ముస్లిమ్ కాలేజీకి చేరుకుంటే అక్కడ అల్పాహారం స్వీకరించిన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్‌లలో అమరావతిలోని వేదిక వద్దకు తీసుకెళ్తారు. అభ్యర్థులను తరలించటానికి 72 బస్‌లను ఏర్పాటు చేశారు.

గుంటూరు చేరుకున్న వివిధ జిల్లాల అభ్యర్థులు ..

అమరావతిలో నేడు జరిగే సభకు రాయలసీమ జిల్లాల నుండి అభ్యర్థులు ముందురోజే గుంటూరుకు చేరుకున్నారు. అనంతపురం జిల్లా నుండి 2 వేల మంది, కర్నూలు జిల్లా నుండి 4 వేల మంది, కడప జిల్లా నుండి 1800 మంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో గుంటూరు నగరానికి చేరుకున్నారు. వారి కోసం నగరంతోపాటు, శివారు ప్రాంతాల్లోని 46 విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థల ప్రాంగణాల్లో వసతి ఏర్పాటు చేశారు. వారు కూడా నేడు ఉదయం గుంటూరు నుండి బస్‌లలో అమరావతి చేరుకుంటారు.

పాస్‌లు అందచేస్తున్న సిబ్బంది

కుంచనపల్లిలో పారిశుధ్య కార్మికుల నిరసన

గుంటూరులో నిరసనలో మాట్లాడుతున్న ముత్యాలరావు

పని గంటల పెంపుపై ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి, లేబర్ కోడ్‌లు తెచ్చిన కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల ఆదాయాలు లేక కొనుగోలు శక్తి తగ్గిపోతోందని, నిరుద్యోగం పెరుగుతున్న ఈ తరుణంలో పనిగంటలు పెంచటం దారుణమని అన్నారు. దీని వల్ల నిరుద్యోగం మరింత దిగజారుగుతుందన్నారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ లేబర్‌కు గత 20 ఏళ్లుగా వేతనాలు సవరించకపోగా పనిగంటలు పెంచటానికి మాత్రం సిద్ధమైందని విమర్శించారు. కనీస వేతనాలను పెంచి, సమయానికి చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మంగళగిరి నిరసనలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, ఎ.ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, ఎస్.గణేష్, ఎన్.బ్రహ్మేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, యు.శ్రీనివాసరావు, ఎన్.చిన్న, బి.శ్రీను, శ్రీనివాసరావు ఎం.వాసు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కుంచనపల్లిలో డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, పారిశుధ్య కార్మికులు జోజిబాబు, కృష్ణ తులసి, కోటేశ్వరి, రాంబాబు, ప్రసాద్, ఇస్సాక్ పాల్గొన్నారు. గుంటూరులో ఆటోనగర్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సిఐటియు గుంటూరు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అల్యూమినియం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.సాంబశివరావు, కోశాధికారి దయానందం, జి.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

పట్టపగలే దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

షేక్ మస్తాన్(32)తో ఐదేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలానికి వీరిమధ్య వివాదాలు వచ్చి కోర్టు కేసుల వరకూ వెళ్లింది. విడాకులు తీసుకునేందుకు రెండు నెలల కిందట పెద్దల సమక్షంలో ఇరుపక్షాలు అంగీకారానికి వచ్చారు. అయితే మస్తాన్‌పై అయిషా సోదరుడు షేక్ కరీముల్లా కక్ష పెంచుకున్నారు. గురువారం ఉదయం మృతుడు మస్తాన్ స్థానిక లక్ష్మి టాకీస్ సినిమా హాల్ వద్ద హోటల్లో టీ తాగుతుండగా కరిముల్లా హఠాత్తుగా కత్తితో విచక్షణా రహితంగా దాడికి దిగాడు. తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో పడిపోయిన మస్తాన్‌ను కొందరు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతిచెందాడు. మృతదేహాన్ని డిఎస్పీ ఎం.హనుమంతరావు పరిశీలించి కుటుంబీకుల నుండి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నిందితుడు కరీముల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం

రైతుల్ని దెబ్బతీస్తున్న ముంపు

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత పట్టించుకున్న వారు లేరని విమర్శించారు. కెఎల్‌యు వైపు నుండి గుండిమెడ వైపు వెళ్లే రహదారి ఎత్తు పెంచడం వల్ల పొలాలు లోతట్టుగా మారాయని, డ్రెయినేజీ కాల్వలు పూడుకుపోయాయని, రైతులే రోడ్డుకు గండి కొట్టి, వర్షపు నీటిని బయటికి పంపేందుకు తిప్పలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే కాల్వలు పూడిక తీయించి, అవసరమైన చోట కల్వర్టులు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పరిశీలనలో సిపిఎం సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పి.కృష్ణ, నాయకులు ఎన్.విజయరాజు, జి.వెంకటేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు, రైతులు ఎం.వెంకట శివయ్య, వి.శ్రీనివాసరావు, కె.ఉష పాల్గొన్నారు.

వర్షపు నీరుకు నీట మునిగిన కంద పొలం, వర్షపు నీరు బయటకు పోయేందుకు నీట మునిగిన పంట పొలాల రైతులు ఏర్పాటు చేసిన గండి

మహిళలకు ప్రాధాన్యం హర్షణీయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకల్లో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగిస్తూ సాంకే తిక నిపుణులుగా పురుషులతో పాటు మహిళలు రాణించాలని పిలుపునివ్వడం సంతోషకరమని సినీ దర్శకులు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరు ఫిల్మ్ స్టూడియోలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెమెరా ఉమెన్, మేకప్‌ఉమెన్, ఎడిటర్ నుండి 24 విభాగాల్లో మహిళలు సాంకేతిక నిపుణులుగా రాణించడానికి నిర్మాతలు, దర్శకులు అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విఎఫ్‌ఎక్స్ లాంటి అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలు రాజ్య మేలుతున్న తరుణంలో మహిళ సాంకేతిక నిపుణులు ముందంజ వేయడం వలన సినిమాలకు మరింత విలువ పెరిగే అవకాశముందన్నారు.

రావిపాడు రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - పెదనందిపాడు : రావిపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం, జాతీయ ఆహారనూనె గింజల పథకంపై సోయాబీన్ వేసుకున్న రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు శనగ పంట వేసే రైతులు ట్రైకోడెర్మావిరిడి మందుతో కిలో విత్తనానికి 5 నుంచి 8 గ్రాములు వంతున విత్తనశుద్ధి చేసుకోవా లన్నారు. ఎరువులు అక్టోబర్ నుంచి రైతులకి అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం నుండి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు ఐ.సునీత జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాడే విధానం, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఏరువాక కేంద్రం నుండి వచ్చిన శాస్త్రవేత్త డాక్టర్ ఏ.మనోజ్ సోయాబీన్‌లో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. మండల వ్యవసాయాధికారి ఐ.సుబ్రహ్మణ్యం వర్షాల నేపథ్యంలో పత్తిపంటను కాపాడుకోవడానికి 13.0.45 లేదా మూడు 19.19.19ను కిలోకు ఎకరా స్ప్రే చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విహెచ్‌ఏ యోనాష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - చేబ్రోలు

సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం "జాతీయ సేవ పథకం" ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె. సుచరిత్ర జాతీయ సేవా పథకం గొప్ప తనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, సేవా పథకంలో భాగస్వాములై సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.సుధాకర్ విద్యా ర్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగస్వామ్యం కావాలని పేర్కొ న్నారు. కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక జెయంజె మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. శంకర్ కంటి హాస్పిటల్ సహకారంతో ఉచితంగా కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు కంటి సామర్థ్య పరీక్షలు నిర్వ హించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం అతిధోపన్యాసంలో డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ప్రారంభానికి గుర్తుగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ డే జరుపు కుంటామని చెప్పారు. డాక్టర్ జి. జ్యోతి ఓలివియ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శాంత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రోజలిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ శాఖాధ్యక్షులు డాక్టర్ కె అరుణ సూజాత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు డాక్టర్ పి జెన్నమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పలు సామాజిక సేవా కార్యక్రమాలు ద్వారా ప్రజా మన్ననలు పొందుతున్న సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు అభినందనీయులని తెనాలి తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని బుధవారం రామలింగేశ్వరపేటలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సొసైటీ ఆధ్వర్యంలో 400 మంది పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణి చేశారు. కార్యక్రమానికి తహశీల్దార్ బిసి సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గం అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరెన్ని సేవా కార్య క్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కంకిపాటి రమేష్ కుమార్, బి సుధాకర్, సభ్యులు బొమ్ము రామకష్ణారెడ్డి, కాకుమాను ఉమాశంకర్, అవధానుల సత్యదేవ్, పూర్ణ, ఐజెయు సభ్యులు ఓతుకోలు మార్కండేయులు, హైకోర్టు న్యాయవాది వింజమూరి ప్రసాద్, రఘునాథ్, సిప్లా సాయి, కృష్ణ పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ చేస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

102 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతిలోని తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీ య కార్యాలయం స్కిల్‌హబ్ ప్రాంగణంలో బుధ వారం జాబ్ మేళా జరిగింది. జాబ్ మేళాలో మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. 450కి పైగా ఉద్యోగాలకు 247 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 102 మందికి ఉద్యోగాలు లభించాయి. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సిఆర్‌డిఎ సామాజిక సంక్షేమ విభాగ డిసిడిఓ బొర్రా శ్రీనివాసరావు నియామక పత్రాలు అందజేశారు.

నియామక పత్రాలు చూపుతున్న అభ్యర్థులు

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తెనాలి

ఆంధ్ర ప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించారు. వార్షిక నివేదికలు, ఉద్యోగుల సమస్యలపై జరిపిన పోరాటాలు వంటి అంశాలను చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.ఉమాశంకర్, టి సుజన్, కోశాధికారిగా ఎండి బాబా తాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎం.సాంబశివరావు, టీవీఎస్ ఎన్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా వి వాణిశ్రీ, పి జోసెఫ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మున్సిపల్ మేనేజర్ కె విల్సన్ జయకర్, సహాయ ఎన్నికల అధికారిగా రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు అభినందించారు.

కోర్టు నోటీసు
మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్. నెం. 181/2024

బిట్వీన్ :
నాగిరెడ్డి వెంకటరామిరెడ్డి ....వాది
మరియు
కొనకండ్ల కాశీ రామారావు .... ప్రతివాది

ప్రతివాది : కొనకండ్ల కాశీ రామారావు, తండ్రి : పూర్ణచంద్రరావు (లేటు), వయస్సు 65 సం॥లు, నివాసం : 15-71, కన్యకా పరమేశ్వరి గుడి ఎదురు, జానపాడు రోడ్డు, పిడుగురాళ్ళ.

పై నెంబరు దావాను వాది దావా ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం ప్రతివాది అయిన మీపై శ్రీయుత కోర్టులో దావా దాఖలు చేసి మీకు కోర్టు నోటీసులు పంపిననూ తీసుకొనకుండా చేయుచున్నందున శ్రీయుత కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసును తెలియజేయుటకు ఆర్డరు వేసి వున్నారు.

కావున పై నెంబరు దావా వాయిదా ది. 26-09-2025వ తేదీన శ్రీయుత కోర్టు నందు ఉన్నందున సదరు తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు గానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరయి కేసును జరిపించు కొనగలరని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది. అలా లేనిపక్షంలో మీకు పరోక్షంగా కేసు జరుగునని తెలియజేయు చున్నాము.

వాయిదాతేది : 26-9-2025

షేక్ మౌలాలి,
వాది తరపు అడ్వకేట్,
పిడుగురాళ్ళ, పల్నాడుజిల్లా.
సెల్ నెం. **94408 46452**

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION): AT ADDANKI.
O.S.No. 25/2023

Kakarla Vijaya Lakshmi ...Plaintiff
And
Dandu Pushpavathi and Others ...... Defendants

Address
Gudibanda Venkata Sambireddy,
S/o. Somireddy, Brodipet, Guntur City,
Guntur District

పై నెంబరు దావాలోని 2వ ప్రతివాదికి దావా సమన్లు శ్రీ కోర్టువారు పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసి యున్నారు. కావున సదరు 2వ ప్రతివాది అయిన గుడిబండి వెంకట సాంబిరెడ్డి ది. 27.09.2025 వ తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగా గానీ లేదా వకీల్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మా నించబడునని తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు ల ప్రకారం)

వాయిదా: 27.09.2025 **ఇట్లు**

V.Raja Suresh,
Advocate,
D.No. 41-18-53, Krishnalanka,
Vijayawada-13, Cell:9346221022

మహారాజ శ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో
IA NO : 154/2022 IA NO: 1309/2017
O.S NO: 289 of 2015

బిట్వీన్
తిరుమలకొండ పెదవీరయ్య ... పిటిషనర్ (వాది)
Vs
1. బత్తుల సీతారామయ్య (died)
2. బత్తుల హనుమాయమ్మ
3. బత్తుల కోటేశ్వరరావు
4. బత్తుల కృష్ణారావు
5. బత్తుల సుబ్బారావు
6. చల్లా కోటేశ్వరమ్మ
7. బత్తుల పార్వతి .... రెస్పాండెంట్ (ప్రతివాది)

To,
1. బత్తుల సీతారామయ్య (died)
2. బత్తుల హనుమాయమ్మ, భర్త: సీతారామయ్య (లేటు)
3. బత్తుల కోటేశ్వరరావు, తండ్రి : సీతారామయ్య(లేటు)
4. బత్తుల కృష్ణారావు,తండ్రి : సీతారామయ్య (లేటు)
5. బత్తుల సుబ్బారావు, తండ్రి :సీతారామయ్య (లేటు)

2 నుంచి 5 మరియు 7 వ వారల నివాసం: 5వ లైన్, వెంకటరమణ కాలనీ, అన్నపూర్ణ బిల్డింగ్ ఎదురు గుంటూరు టౌన్, గుంటూరు మున్సిపాలిటీ,

పై నెంబరు గల దావా లో శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తము ది 26-09-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు.కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టు లో ఉదయం 10.30 ని:లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరయి మి యొక్క ఆక్షేపణలు తెలుపు కోవలయును.లేనిచో మీ పై పరోక్షముగా తీర్మానించబడుననీ ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులమేరకు

వాయిదా తేదీ. 26-09-2025

శ్రీ బి.ఎల్. చిన్నయ్య,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి . సెల్ :9848771757

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE : GUNTUR
G.W.O.P.No. 1125 / 2025

(In the matter of Estate of Minors : **Dodda Madhuri** and **Dodda Shalini** daughters of **Dodda Santhi Swaroop,** Hindu, aged about 10 & 13 years being minors represented by their natural mother and guardian Dodda Tirumala, wife of late Dodda Santhi Swaroop, Hindu, Aged about 37 years, R/o D.No. 4-20, Yadava Bazar, Katrapadu Village, Vatticherukuru Village & Mandal, Guntur District.)

1. Dodda Tirumala,
W/o late **Dodda Santhi Swaroop,**
Mother and natural Guardian of Minors.
1. Dodda Madhuri,
D/o late **Dodda Santhi Swaroop,**
aged about 10 years
2. Dodda Shalini,
D/o late **Dodda Santhi Swaroop,**
aged about 13 years - Petitioners
Vs
NIL - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనర్లు అయిన **దొడ్డ మాధురి** మరియు **దొడ్డ షాలిని** వీరల తండ్రి లేట్ **దొడ్డ శాంతి స్వరూప్,** పిటిషనర్లు మైనర్లు అయినందున, మైనర్ల తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిలో 2/3 వ భాగమును ఇతరులకు విక్రయించుటకు అనుమతి కోరుతూ మైనర్లకు తల్లిగారు / గార్డియన్ అయిన **దొడ్డ తిరుమల** పిటిషనర్లు తరపున పై తెలిపిన కోర్టులో G.W.O.P.No. 1125 / 2025 ను దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్ విషయమై ఎవ్వరికైనను అభ్యంతరములు ఉన్నయెడల **తే08-10-2025ది న ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

PETITION SCHEDULE PROPERTY

Guntur District - Nallapadu Joint Sub-Registration area - Katrapadu Grama Panchayat - Katrapadu Village bearing D.No. 89-D an extent of Ac.0-29 cents out of Ac.0-59 cents (out of Ac. 1.18 cents) - having D.No. 89-D1 and (L.P.No.530) an extent of Ac.0.29 cents land **bounded: East :** Land in D.No.96, **South:** Land of Dodda Sambhasiva Rao (A'schedule of partition deed fell to his share), **West:** Land of Nanneboina Nagaraju, **North :** Land of Nanneboina Sambaiah, Within these boundaries an extent of Ac.0.29 cents or 0.117 Hector wet land and all easementary right. Out of which minor wards are entitled to undivided 2/3 rd share i.e., Ac.0.19 1/3 cents (i.e., Ac.0.09.66 cents each of minor petitioner).

కె.షఫి సాహెబ్, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనర్లు తరపు అడ్వకేట్, నెల్లూరు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, మంగళగిరి మునిసిపల్, పాత మంగళగిరి, డోర్ నెం 11-262 నివాసి అయిన పాపట్ల దేవా లింగ ప్రకాశరావు గారి కుమారుడు అయిన **1) పాపట్ల మోజెస్ కమల్ కుమార్, ఈయన భార్య 2) పాపట్ల ఇందిరా** గారి ద్వార సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్స్ అయిన **1) పాపట్ల మోజెస్ కమల్ కుమార్, 2) పాపట్ల ఇందిరా గారికి 1) కాకాని మాధురి 2) ఇనపనూరి శివకుమారి** గార్లు కలిసి ఏకస్తులై ది.07-11-2024 తేదిన S.R.O. మంగళగిరి నందు ఒక విక్రయ దస్తావేజు రిజిస్టర్ చేసినారు. సదరు విక్రయ దస్తావేజు రిజిస్టర్ నెం 13929/2024 తేది.07-11-2024 న రిజిస్టర్ కాబడినది.

నా క్లయింట్స్ యొక్క ఒక విక్రయ దస్తావేజు రిజిస్టర్ కాబడిన ఆస్థి నకు సర్వే నెం 91/2 లో చ.గ 118.6 లు సంక్రమించి తదాది నుండి నేటి వరకు సదరు స్థిరాస్తిని నా క్లయింట్ యొక్క సర్వసంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో నిర్వివాదముగా అనుభవించుచు న్నారు. సదరు స్థలములో ఆర్.సి.సి.డాబా ఇల్లు నిర్మించినారు. సదరు ఆర్.సి.సి.డాబా ఇంటికి ఇంటి పన్ను కొత్తగా ఇంటి పన్ను కొరకు అప్లై చేసుకొనుటకుగాను శ్రీమంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, కమిషనర్ వారికీ అర్జీ దాఖలు చేసియున్నారు. నా క్లయింట్స్ కి కొత్తగా ఇంటి పన్ను పేరు విధించుటకు గాను కార్పొరేషన్ వారు డెత్ సర్టిఫికేట్, వారి వారి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్స్ అడిగియున్నారు. లేనిచో పేపర్ ప్రకటన వేయమన్న కారణంగా ఈ బహిరంగ ప్రకటన వేయుచున్నాము.

నా క్లయింట్స్ అయిన **1) పాపట్ల మోజెస్ కమల్ కుమార్, 2) పాపట్ల ఇందిరా** స్వాధీన పరచుకొని సమస్త హక్కులతో అనుభవించుచున్న గుంటూరు డి. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, మంగళగిరి సబ్ డి.యిలాకా, మంగళగిరి రెవెన్యూ గ్రామం తాలూకు డి.నెం.91/2 రు లో చ.గ. 118.6 లు మింజుమలే మరియు మంగళగిరి మున్సిపల్ గల ప్రస్తుత స్థిరాస్తి ఆర్.సి.సి. డాబా ఇల్లు యీ హద్దుల మధ్య చ.గ. 118.6 లు లేక చ.మీ. 99.16 ర్లు మాత్రమే ఈ ఆస్థి గురించి ఎవరికైన ఏ విధమైన క్లెయిమ్లు గాని, అభ్యంతరములు వగైరాలు గాని, వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోగ శ్రీ మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ వారికి గాని, మరియు ఈ క్రింది అడ్రస్ కు లికిత పుర్వంగా తెలియజేయవల సిందిగా కోరటమైనది.

గడువు లోపల ఎటువంటి అభ్యంతరాలు రాని యెడల షెడ్యూల్ ఆస్తి నిష్కేచి ఆస్తిగా భావించి నా క్లయింట్స్ **1) పాపట్ల మోజెస్ కమల్ కుమార్, 2) పాపట్ల ఇందిరా** నకు అను నా క్లయింట్ యొక్క పేరును మున్సిపల్ కార్పొరేషన్ ఇంటి పన్ను రికార్డ్స్ నమోదు చేయబడును అని ఇందుమూలంగా తెలియ జేయుటమైనది.

మంగళగిరి,
తారీఖు :24-09-2025

బుల్లా రమేష్ బాబు, B.A., L.L.B
బుల్లా చందు, B.Tech, B.L.
అడ్వకేట్ & నోటరి,
గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
డోర్ నెం:5-517, రాజీవ్ సెంటర్,
మంగళగిరి, గుంటూరు జిల్లా,
సెల్ : **9394076578**

MACHERLA MUNICIPALITY
e-procurement tender notice
Roc.No.250/2019/E1, Dt:-24-09-2025
NIT. No.31/2025-26 to 50/2025-26 (Twenty Works Only)
DMF Grant - Rs.215.00 Lakhs

Further details can be seen at 'e' procurement Market place in www.apeprocurment.gov.in officer inviting bids Commissioner, Macherla Municipality, Macherla, Andhra Pradesh.
Bid Document Download start Date : 25-09-2025 at 10.30 A.M.
Bid Document Download End Date : 09-10-2025 at 3.00 P.M.
Last date & Time for receipt of Bids : 09-10-2025 at 4.00 P.M.
Price Bid Opening Date :: 09-10-2025 at 4.30 P.M.
Further details can be seen at 'e' procurement Market place in www.apeprocurment.gov.in officer inviting bids Commissioner, Macherla Municipality, Macherla, Andhra Pradesh.
Ph: 9849905838

Sd/ - Commissioner
Macherla Municipality

సాగర్‌కు కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతోంది. దీంతో బుధవారం ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 8 గేట్లను 5 అడుగులు, 18 గేట్లను 10 అడుగుల వరకు ఎత్తి 3,20,046 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 3,66,694 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అదేస్థాయిలో ఔట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. కుడికాల్వకు 9,019 క్యుసెక్కులు, ఎడమ కాల్వకు 2,765, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 32,764, ఎస్ఎల్‌బిసికి 1,800, వరద కాల్వకు 300 క్యూసెక్కులు చొప్పున దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 588.60 అడుగుల వద్ద ఉంది. ఇది 303.4310 టీఎంసీలకు సమానం.

నల్లబర్లీ వేస్తే ధ్వంసం చేస్తాం : తహశీల్ధార్

ప్రజాశక్తి - వినుకొండ

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధమని టాస్క్‌ఫోర్స్ కన్వీనర్ అయిన మండల తహశీల్ధార్ సురేష్‌కుమార్ చెప్పారు. విఆర్‌ఒలు, వ్యవసాయ గ్రామ సహాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కరైతు కూడా నల్లబర్లీ పొగాకు సాగుచేయడానికి వీల్లేదని, ఈ విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఎవరైనా సాగు చేస్తే దాన్ని టాస్క్‌ఫోర్స్ కమిటీ ద్వారా ధ్వంసం చేస్తామన్నారు. తెల్లబర్లీ పొగాకు సాగు చేయాలనుకుంటే కంపెనీల నుండి సంబంధిత రైతులు బాండును పొందాల్సిందేనని స్పష్టం చేశారు. బాండును చూపించాకే సాగు చేయాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయా ధికారి జి.వరలక్ష్మి, ఉద్యాన శాఖాధికారి రసూల్ పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - వినుకొండ

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులెవరైనా ఐటిఐలో చేరవచ్చునని శ్రీబాలాజీ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ పేర్కొన్నారు. విటంరాజుపల్లిలోని తమ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐటిఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30న జరిగే చివరి కౌన్సిలింగ్‌కు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు 10వ తరగతి మార్కుల లిస్ట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకొని కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐటిఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కోర్సు పూర్తి చేసిన వారు అదనంగా రెండు సబ్జెక్టులు రాస్తే నివోస్ న్యూఢిల్లీ ద్వారా ఇంటర్మీడియట్‌కు సమాన అర్హత గల సర్టిఫికెట్ పొందొచ్చని, బ్రిడ్జి కోర్సు ఎంట్రన్స్ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా 2వ సంవత్సరంలో చేరొచ్చని, ఐటిఐ రెండేళ్లు పూర్తి చేసిన వారికి ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. మరింత సమాచారం కోసం 9440542030, 85558 67782 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఆటోమిత్రకు గత ప్రభుత్వ నిబంధనలే

- అర్హతపై ఆటోవాలా ఆందోళన
- నేడు రేపో అర్హుల జాబితా?

ప్రజాశక్తి-చిలకలూరిపేట

'ఆటో మిత్ర' పథకం కింద ఆటో, మాక్సీ, మోటారు క్యాబ్ వాహనదార్లకు ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి తామంతా అర్హులమని ఆటోవాలాలు భావించినా ప్రభుత్వ నిబంధనలు మాత్రం వారి ఆశలు అడియాశలు చేసేలా ఉన్నాయి. ఈ పథకానికి గత వైసిపి ప్రభుత్వం విధించిన ఆక్షలనే ఇప్పటి ప్రభుత్వమూ అమలు చేస్తోంది. గతంలో లబ్ధిపొందిన వారి వివరాలను సచివాలయాలకు పంపి విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఇకవైసి చేయించారా? ఎవరైనా మరణించారా? లేదా వాహనాలను అమ్ముకున్నారా? అనే వివరాలు సేకరించారని సమాచారం. గత ప్రభుత్వం చివరిసారిగా 2023 సెప్టెంబర్ 29న వాహన మిత్ర సాయాన్ని అందించింది. తాజాగా ప్రభుత్వం గతనెల 31వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. అయితే ఇది తెలియని కొందరు దరఖాస్తు చేసుకోలేదు. తమకు మరోసారి అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

అర్హులకు దసరా కానుకగా అక్టోబరు ఒకటిన ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున సాయం అందించనున్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారు. అర్హతలు, నిబంధనలు తదితర మార్గదర్శకాలతో ఈ నెల 13న ఉత్తర్వులిచ్చారు. పథకానికి అర్హత సాధించాలంటే సొంత ఆటో లేదా మ్యాక్సి మోటార్ క్యాబ్ కలిగి ఉండాలని, లైసెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే లబ్ధిదార్ల గుర్తింపు పూర్తయిందని, రెండ్రోజుల్లో తుదిజాబితా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

వీరు అనర్హులు..

రూ.10 వేల వేతనం పొందుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్వాడీ, ఆశా తదితర నిరుద్యోగుల కుటుంబాల వారు, విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిన కుటుంబాల వారు, మూడెకరాల మాగాణి లేదా పదెకరాల మెట్ట భూమ ఉన్నవారు, గ్రామీణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులు, పట్టణ ప్రాంతంలో 1500 చదరపు అడుగులు ఇల్లున్నవారు అనర్హులు. ఈ నిబంధనలన్నీ గత వైసిపి ప్రభుత్వ హయాంలోనూ అమలు చేశారు.

ఆటో నాదే.. లబ్ధి వేరొకరికి..

ఇంటర్ వనకు చదుకున్న నేను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. కొత్త ఆటోను కొనుక్కునే ఆర్థిక స్తోమత లేనందున వేరొకరి ఆటోను అగ్రిమెంట్ ద్వారా కొనుక్కున్నాను. ఈ విషయాన్ని ఆర్‌టివో దృష్టికి తీసుకెళ్లగా ఆటో మిత్ర పథకం వర్తించదని, వాస్తవ యజమానికి వర్తిస్తుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో వాస్తవాల ఆధారంగా లబ్ధిదార్లను ఎంపిక చేస్తే నాలాంటి ఎందరికో మేలు జరుగుతుంది.

జి.శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్ చిలకలూరిపేట.

ఇళ్ల స్థలాల కోసం ఎరుకల కాలనీవాసుల ఆందోళన

ప్రజాశక్తి - మాచర్ల

తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహశీల్ధార్ కార్యాలయం వద్ద స్థానిక తొమ్మిదో వార్డు ఎరుకల కాలనీ ప్రజలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా నిరుపేదలమని, సంచార జీవితం గడుపుతూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. కాలనీవారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోగా కొందరికి ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు చెబుతున్నారని, అయితే ఎవరికి మంజూరయ్యాయో వివరాలు మాత్రం తెలియడం లేదని చెప్పారు. ఇప్పటికే చిన్నిచిన్న పాకల్లో ఉంటున్న తాము ఆ చిన్న ఇంటిలోనే రెండు మూడు కుటుంబాలు కాపురం ఉండాల్సి వస్తోందని, తమ ఆవేదనను గుర్తించాలని కోరారు. తహశీల్ధార్ కిరణ్ కుమార్ స్పందిస్తూ విఆర్‌ఒతో సర్వే చేయించి మంజూరైనవి కాకుండా, మిగిలిన అందరికీ స్థలాలిప్పిస్తామని హామీనిచ్చారు.

చెత్త కనిపిస్తే జరిమానా : కమిషనర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం పర్యటించారు. పారిశుధ్య పనులు, వివిధ ప్రాంతాల్లో పరిశీలించిన ఆయన పల్నాడు రోడ్డులోని తోపుడు బండ్ల వారితో మాట్లాడారు. బండ్ల చుట్టూ ఎక్కువగా ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ 2 చెత్త బుట్టల విధానాన్ని పాటించాలని, తడి, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ వాహనాలు వచ్చినపుడు అందించాలని ఆదేశించారు. తోపుడు బండ్లు, దుకాణాల వద్ద చెత్త కనిపిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అంబేద్కర్ స్ఫూర్తిని చాటిచెప్పిన సంఘం శరణం గచ్ఛామి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కొందరి కోసం కాదు.. అణగారిన అందరి కోసం అంబేద్కర్ అని చెబుతూ స్థానిక లూథరన్ చర్చి ప్రాంగణంలో అభ్యుదయ ఆర్ట్స్ హైదరాబాద్ వారు మంగళవారం రాత్రి ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, చర్చి సహకారంతో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు, విగ్రహాల ఆవిష్కరణలను రాజకీయ నాయకులు వారి స్వప్రయోజనాలకు చేస్తున్నారేగాని అంబేద్కర్ చెప్పిన విలువలను మాత్రం పాటించరని, ఇది చూసి ఆంబేద్కర ఆత్మ ఘోషిస్తుందనే సన్నివేశంతో ప్రదర్శన ప్రారంభమైంది. పాఠశాలలో చదువుకునేటప్పుడు, ఆటలాడే సందర్భంలో తోటి పిల్లల నుండి అంబేద్కర్ ఎదుర్కొన్న తీవ్ర వివక్షను కళాకారులు కళ్లకుకట్టారు. ఎన్నో తీవ్రమనైన ఆర్థిక ఒడిదుడుకులు, కుటుంబ సమస్యలను అనుభవించి ఉన్నత విద్యను అభ్యసించిన ఘట్టాలను ప్రదర్శించారు. అందరిలో ఒకడు కాడు.. అందరి కోసం ఒక్కడుగా అంబేద్కర్ నిలవడం కోసం ఆయన భార్య చేసిన త్యాగాలు, అనారోగ్యానికి గురైన బిడ్డకు వైద్యానికి డబ్బు లేక మరణించిన దైన్యం, తాళి అమ్మి అంబేద్కర్ చదువులకు పంపినీ సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. చదువులు పూర్తయ్యాక ఇండియాకు వచ్చిన అంబేద్కర్ చేసిన పోరాటాలను ప్రదర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుతున్న పాలకులను ప్రశ్నిస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతినబూనగా అక్కడే ఉన్న అంబేద్కర్ ఆత్మ విగ్రహంలో విలీనమవడంతో ప్రదర్శన ముగుస్తుంది. ప్రదర్శనను చూడడానికి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, వివిధ సంఘాల శ్రేణులు, పట్టణ ప్రజలు తరలివచ్చారు.

కార్మికుల పనిగంటల పెంపుపై ఐక్యంగా పోరాడాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 13 గంటలు పెంచుతూ చట్టసభల్లో తీసుకున్న నిర్ణయాలపై కార్మిక వర్గం సంఘటితమై ఐక్య ఉద్యమాలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు మంగళగిరి పట్టణ 12వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జెండాను సిఐటియు పట్టణ అధ్యక్షులు వై.కమలాకర్ ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాసే నిర్ణయాలను చేస్తున్నారని విమర్శించారు. 13 గంటలు రోజు పనిచేస్తే కార్మికుల జీవన విధానం దారుణంగా మారిపోతుందని అన్నారు. కుటుంబంతో గడిపే అవకాశం కూడా ఉండదని అన్నారు. కార్మికుల శ్రమను దోచే విధంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. శాసనసభలో, శాసనమండలిలో ఈ బిల్లును ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా వ్యతిరేకించలేదని అన్నారు. కార్మిక హక్కులను హరించే విధానంలో వైసిపి, టిడిపి ఒకటేనని అన్నారు. కార్మికుల గురించి మాట్లాడేందుకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో వాళ్ళ ఇష్టానుసారం చట్టాలను చేస్తున్నారని అన్నారు. సిఐటియు మంగళగిరి పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టి మాట్లాడారు.

మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ, కొల్లిపరలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

సిఐటియు నాయకులు జె.వి.రాఘవులు, వి.వి.జవహర్‌లాల్, ఎస్.ఎస్.చెంగయ్య, టి.శ్రీరాములు, తదితరులు ప్రసంగించారు. పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం సిఐటియు పట్టణ కమిటీ 41 మందితో ఏర్పడింది. సిఐటియు మంగళగిరి పట్టణ కన్వీనర్‌గా ఎం.బాలాజీ, కో కన్వీనర్లుగా వి.వి.జవహర్‌లాల్, జె.వి.రాఘవులు, ఎస్.ఎస్ చెంగయ్య, వై.కమలాకర్, పి.బాలకృష్ణ, టి.శ్రీరాములు, షేక్ జానీ భాష, కె.బుజ్జి బాబు, వై.శివనాగేశ్వరరావు, కె.పాములు, కె.శ్రీను, కె.హేమలత, కె.శ్రావణి, కె.వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవగేయాలని ఆలపించారు.

ప్రజాశక్తి - కొల్లిపర

శాసనసభ ఆమోదించిన పని గంటల పెంపు చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొల్లిపర పంచాయతీ కార్మికులు బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కొల్లిపర ఏరియా నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, కార్మికుల శ్రమని మరింత దోపిడీ చేయడం కోసం ఈ చట్టాన్ని చేశారని, కార్మిక వర్గం ఇలాంటి విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్మిక కోడ్‌లో భాగంగా ఇలాంటి సవరణలు ప్రవేశపెడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.భావన్నారాయణ, కార్మికులు జి.సుందర్రావు, ఎం.రమేష్, దీనమ్మ, సుజాత, మరియమ్మ, ఏసు పాదం, పిచ్చయ్య కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కార్మికులు స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శికి అర్జీ ఇస్తున్న నాయకులు

పెంచిన పనిగంటలు తగ్గించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

పెంచిన పని గంటలు తగ్గించాలని, కూటమి ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడీ చేయడమే కాక వారి కుటుంబాలపై కూడా దాడి చేయడమే అవుతుందని సిపిఎం నాయకులు వై.స్టాలిన్ అన్నారు. మండలంలోని మంచికలపూడి గ్రామ సచివాలయంలో కూటమి ప్రభుత్వం పని గంటలు 8 నుండి 13కు పెంచి బిల్లు చేసినందుకు నిరసనగా బుధవారం పంచాయతీ కార్యదర్శి ఎ.రామ్మోహన్‌రావుకు అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై.బ్రహ్మేశ్వరరావు, ఎ.పాములు, ఎం.సుందరరావు, వి.శేషగిరిరావు, ఎ.శేషగిరిరావు, పి.శ్రీరాములు, వై.సుధ, పి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

295వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 295వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ సభ్యులు షైక్ సుభాని, బురగ అంకయ్య, ముసలా సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలలో సిహెచ్.పిచ్చయ్య, బి.సూర్యప్రకాష్, ఎండి ఇస్మాయిల్, ఎం.గురవయ్య, ఉప్పు కాసమ్మలు కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఎస్.దేవరాజు, ఈ.శరమ్మా, రమాదేవి, షేక్ ఇమాంబి, దుర్గాభవాని, వి.రిబ్కా, డి.నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

గుంతలమయంగా రాజధాని రోడ్డు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రోడ్డు గుంతలమయంగా మారింది. గుంటూరు, పరిసర ప్రాంతాల నుంచి రాజధాని అమరావతికి భారీ వాహనాలలో నిర్మాణ సామగ్రిని తరలిస్తున్నారు. వీటితో పాటు ఇసుక లారీలు, ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గుంటూరు నుంచి వెలగపూడిలోని సచివాలయంకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. భారీ వర్షాలు కురుస్తుండడంతో నీరు గుంతల్లోకి చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

రాజధాని ప్రాంతం తుళ్లూరు వద్ద గుంతల్లోకి చేరిన నీరు

రోడ్డు నిర్మించాలి.. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

గుంటూరు నుంచి సచివాలయంకు వచ్చే రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం శాసనసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజక వర్గంలో రోడ్లు దెబ్బతిన్నాయని, ప్రధానంగా గుంటూరు నుంచి సచివాలయంకు వచ్చే రోడ్డు పాడైందని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కొంతమంది ఎమ్మెల్యేలు తనకు చెప్పారని స్పీకర్ దీష్టికి తీసుకొచ్చారు. రాజధాని నిర్మాణ సామాగ్రితో భారీ వాహనాల రాకపోకలు, భారీ వర్షాల వల్ల రోడ్డు పాడైందని సభలో చెప్పారు. సిఆర్‌డిఎ లేదా ఆర్ అండ్ బి నిధులతో కొత్త రోడ్డును నిర్మించాలని ఆయన కోరారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతు సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మంచికలపూడి గ్రామ రైతు సంఘం కమిటీని మంగళవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షునిగా అద్దంకి పాములు, కార్యదర్శిగా వై.బ్రహ్మేశ్వర రావు, సభ్యులుగా జమ్ముగాని రాంబాబు, పులి రాజు, యార్లగడ్డ శివనాగేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్.యోగేశ్వరరావు వై.స్టాలిన్ హాజరయ్యారు.

పంచాయతీ కార్యదర్శికి మెమోరాండం అందజేస్తున్న శివాజీ

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని అగతవరప్పాడు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మీనాక్షికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో సంవత్సరం నుండి సబ్బులు, నూనె, యూనిఫామ్, గ్లౌజులు, మాస్కులు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి పి.మీనాక్షి మాట్లాడుతూ వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాజా రమేష్ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాబు, జె.కామేశ్వరరావు, జి.రత్నకుమారి, కె.కీర్తి, టి.ధర్మరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ ఆరోగ్యాధికారి ఎం.ఏసుబాబు బుధవారం పరిశీలించారు. స్థానిక 31, 40 వార్డులలో తెనాలి విజయవాడ రోడ్డు వెంబడి సైడ్ కాలువలలో వ్యర్థాలను కార్మికులు తొలగించారు. ఎంహెచ్ఓ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మురుగునీటి పారుదలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.లక్ష్మీనారాయణ, వార్డు శానిటరీ సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుంటూరు

స్కూల్స్ స్వీపర్లకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గాలిబి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్ కార్మికులకు ఇప్పుడు ఇస్తున్న రూ.6వేలు జీతం నెలల తరబడి పెండింగ్‌లో ఉంచితే వీరి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిరు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటిజన్స్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. గ్రామాల్లో రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అమల, అంజలి, గౌరవాధ్యక్షులుగా దండా లక్ష్మీనారాయణ, 21 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

అగ్రిసెట్‌లో బి.ఆర్ & ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి ప్రత్తిపాడు

అగ్రిసెట్‌లో ప్రత్తిపాడు మండల పరిధిలోని యనమదల బి ఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డి.అమృత మంగళవారం తెలిపారు. ఈనెల 23వ తేదీన ప్రకటించిన అగ్రిసెట్ ఫలితాలలో నేలపాటి స్వాతి 45 ర్యాంకు, ఫిరంగి అభిలాష్- 127 ర్యాంకు, గళ్ళ గోపీచంద్ - 136 ర్యాంకు, ఈదర నందు శ్రీ -181 ర్యాంకు సాధించారని వివరించారు. సీట్లు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాసరావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, కోర్స్ ఇన్‌చార్జ్ సయ్యద్ హమద్ బాషా అభినందించారు.

ఎమ్మెల్యేచే ఎల్‌ఓసిలు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

ఎల్‌ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే

మండలం విఠం రాజుపల్లి గ్రామానికి చెందిన వజ్రాల రామకృష్ణారెడ్డి, కోరా కుల మల్లేశ్వరికు ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసి పత్రాలను ప్రభుత్వ చీఫ్‌విప్, శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు అందజేశారు. వారి కుమార్తె ఆనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తోంది. ఆపరేషన్ నిమిత్తం డబ్బులేక పోవడంతో కుటుంబ సభ్యులు ఆంజనేయులు దృష్టి కి తీసుకురాగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వారికి రూ.17 లక్షల 50వేలు మంజూరు చేయించి బుధవారం అందజేశారు.

నూతన ఎంపిడిఓ సాయిలీలను సన్మానించిన సిబ్బంది

పెదకూరపాడు ఎంపీడీవోగా సాయి లీల

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు ఎంపీడీవోగా కె. సాయిలీల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తాడికొండ ఈఓపిఆర్డిగా పని చేశారు. ఎంపీడీవోగా ప్రమోషన్‌పై పెదకూర పాడుకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్చార్జి ఎంపీడీవోగా వ్యవహరించిన సోమయాజులు, ఈవోపిఆర్‌డి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆమెను దశ్శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం పట్టణంలోని పలు వార్డులలో పరిశుభ్రత పనులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పల్నాడు రోడ్డులోని తోపుడు బండ్ల చుట్టూ ఎక్కువగా ఉన్న చెత్తను గమనించి అక్కడి వ్యాపారులకు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ వాహనాలు వచ్చినపుడు అందించాలని ఆదేశించారు. తోపుడు బండ్ల వద్ద, ఆయా దుకాణాల వద్ద చెత్త కనిపిస్తే జరిమానా విధిస్తామన్నారు. ప్రతి దుకాణం వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు.

తిమ్మాపురంలో పొలం పిలుస్తుంది

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కే. శ్రీనివసరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి పంటలో తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌బర్లీ పొగాకు సాగును ఈ సంవత్సరం పూర్తిగా నిషేధించిందన్నారు. మండల వ్యవసాయాధికారి, హరిప్రసాద్ మాట్లాడుతూ, కవులు రైతులు అందరు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులు తీసుకోవాలనీ, ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని పంటలకు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. తదుపరి గ్రామంలోని పత్తి పొలానికి సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది, బిలాల్, ఎన్ అనుపమ, శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

దేవి నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజు కారంపూడి గ్రామంలో శ్రద్ధా భక్తులతో నిర్వహించారు. మూడవరోజు అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చి ఆశీర్వదించారు. అద్భుతంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. లేత పసుపు రంగు వస్త్రాలతో, పూలతో, పండ్లతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

రహదారికి ఇరువైపుల ఆక్రమణకు గురైన స్థలం

అదిగో జాగా.. వేసేయ్ పాగా!

అక్రమార్కుల చెరలో రాజుపాలెం పంచాయతీ స్థలాలు..?
ధర్నాకు సిద్ధమైన మూడు గ్రామాల ప్రజలు..!

ప్రజాశక్తి - రాజుపాలెం

మండల కేంద్రమైన రాజుపాలెంలో కొందరు పంచాయతీ అధికారుల అండదండలతో అక్రమార్కులు అడ్డగోలు ఆక్రమణలతో పేట్రేగిపోతున్నారు. రహదారులు, పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తూ ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు. మమ్మల్ని అడిగేదేవరు? మాకు అడ్డెవరు అనే ధోరణిలో కొందరు రాత్రికి రాత్రే ఖాళీ స్థలాలను ఆక్రమించారు.

గతంలో ఆక్రమణల తొలగింపు చేపట్టినా రాజకీయ నాయకుల జోక్యంతో మధ్యలోనే ఆపేశారు. రాజుపాలెంలో మాచర్ల - గుంటూరు ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి రాజుపాలెం, గంగిరెడ్డి పాలెం, బ్రాహ్మణ పల్లి గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి నుంచే రాకపోకలు కొనసాగిస్తారు. రహదారికి ఇరువైపులా ఆక్రమించి, దుకాణాలు నిర్మాణాలు చేపట్టడంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు తాజాగా చేపట్టిన ఆక్రమణతో వేలాది మంది అవస్థలు పడే దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో ఏటికేడు జనాభా పెరిగిపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రైల్వేగేట్, పోలీసు స్టేషన్, తహశీల్దారు, ట్రెజరీ, ఎంపిడిఓ, ఏంఆర్‌ఓ, తదితర కార్యాలయాలున్నాయి. ఇక్కడ పలువురు యథేచ్ఛగా ఆక్రమించేసి పక్కా కట్టడాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక రావడం, పంచాయతీ అధికారులకు పెద్దయెత్తున ఫిర్యాదులు అందడంతో అక్రమణల నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం మరోమారు గ్రామ ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నోటీసులతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన ఆక్రమణలు తొలగించకపోతే మూడు గ్రామాల ప్రజలు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

స్వస్థ నారి స్వసక్తి పరివార్ అభియాన్

ప్రజాశక్తి - క్రోసూరు

కుటుంబంలో మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే ఆ కుటుంబం సమాజంలో బలంగా ఉంటుందన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థ నారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వక్తలు నల్లజాల సదా శివరావు, బలరామకృష్ణ రాజ్, గ్రఫీన్, శిఖా శాంసన్ అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరులో స్వస్థనారి స్వసక్తి పరివార్ అభియాన్ శిబిరాని ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పిఎంజెవై, పిఎంఎంవివై పథకాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశాంసన్ స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ ఉచిత క్యాంపులు నిర్వహించే ప్రదేశాలను వెల్లడించారు. ఆరోగ్య కార్యకర్త కామేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీరయ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు గ్రామస్తులు ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాలాది ఆరోగ్య సచివాలయంలో స్వస్థనారీ సశక్తి అభియాన్ కార్యక్రమం" జరిగింది. కార్యక్రమంలో జాలాది ఆరోగ్య సచివాలయం పరిధిలో 71 మంది స్త్రీలకు వైద్య ఆరోగ్య సిబ్బందిచే అన్ని ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి రవిరత్నాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో భరద్వాజ, వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చలమయ్య భౌతిక కాయనికి గురజాల ఎమ్మెల్యే నివాళులు

నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కతిక శుక్లా

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అనారోగ్యంతో మృతి చెందిన టిటిడి అడిషనల్ ఈఓ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి తండ్రి చలమయ్య (85) భౌతిక కాయం వద్ద గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టిటిడి జేఈఓ వెంకయ్య చౌదరిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు,కంతేటి శివ ప్రసాద్, చిరుమామిల్ల కష్ణయ్య, కుర్రిశివారెడ్డి, మల్లయ్య, డీలర్ వెంకటేశ్వర్లు, కర్నాటి రామయ్య, చిరుమామిల్ల వెంకటేశ్వర్లు, ఘంటా ధనుంజయరావు, గొట్టిముక్కల బాబు ఉన్నారు.

చలమయ్య భౌతిక కాయానికి కలెక్టర్ నివాళులు

పల్నాడు కలెక్టర్ కతిక శుక్లా చిరుమామిల్ల చలమయ్య భౌతిక కాయాన్ని బుధవారం సందర్శించి నివాళులు అర్పించారు. టిటిడి జేఈఓ వెంకయ్య చౌదరికి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ మురళి,మాచెర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్ ఉన్నారు.

మ్యాజిక్ సైడ్ డ్రైన్స్ పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని గుండేపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన మ్యాజిక్ సైడ్‌డ్రైన్స్ పనులను డ్రామా పీడీ శిద్ధ లింగ మూర్తి బుధవారం పరిశీలించారు. గ్రామపంచాయతీలో అవసరమైన ప్రాంతాలలో మ్యాజిక్ సైడ్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్పరాజ్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఈపూరు

స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ కె హేమలత తెలిపారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేస్తారని ఆమె తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి కోరారు. బుధవారం మండలంలోని బలుసుపాడులో నిర్వహించిన పోషణ మాసోత్సవాలులో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ సేవా పథక స్థాపనా దినోత్సవం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథక స్థాపనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ కే.కవిత మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థులకు సామాజిక సేవలో పాల్గొనడానికి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. సేవ ద్వారా విద్య జాతీయ సేవా పథకం నినాదం, ఇది సమాజం నుండి నేర్చుకోవడానికి, సమాజానికి సేవచేయడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జంగంలక్ష్మీ సులోచన, డి.ఆదెయ్య, వై.రమేష్‌బాబు, సాంబ శివరావు, కుసుమకుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలు నాయక్, రమేష్, అంకమ్మ, అరుణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎంఎఎం కాలేజీ ఆఫ్ ఫార్మసీలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) 56వ ఫౌండేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థులు ఎలో క్యూషన్, క్విజ్, వ్యాసరచన వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు విద్యార్థులలో సామాజిక బాధ్యతా భావం, జ్ఞానం, సేవాస్ఫూర్తిని పెంపొం దించడంలో దోహదం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకలో కళాశాల చైర్మన్ ఎం. రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం. ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కావడానికి ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్లు డాక్టర్. రజిని, నాగలక్ష్మి, షలీమ్ రాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కుటుంబాలు

25 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రజల సంతోషమే లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్-6 పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి వైసీపీ అధినాయకత్వం జీర్ణించు కోలేక పోతోందనీ, ఆ పార్టీ సానుభూతి పరులు ప్రజలు మెచ్చిన ప్రభుత్వానికి మద్ధతుగా నిలుస్తున్నారని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు ఆయన నివా సంలో టీడీపీలోకి చేరాయి. వైసీపీ ప్రముఖ నాయకులు పాటిబండ్ల చినవీరయ్య, పెద వీరయ్య, దావీదు, సుమన్, కోటయ్య సహా 25 కుటుంబాల వారు మాజీమంత్రి చేతుల మీదుగా టీడీపీ కండువాలు వేయించుకున్నారు. టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు కెల్లంపల్లి ఆచయ్య, పెంట్యాల శేషయ్య, వలేటి హిమవంతరావు, మాజీ సర్పంచ్ పెనుముల జాన్ బాబు, కాట్రూ శ్రీనివాసరావు, జంపని వెంకటేష్ పాల్గొన్నారు.

గల్లీకి అడ్డంగా ఆటోలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని ప్రధాన రహదారులపై ఆటోవాలాలు గల్లీలోకి వాహనాలు పోకుండా, ప్రజలు నడిచే వీలులేకుండా వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. స్థానిక అమృత స్వీట్ షాప్ పక్కనే ఉన్న గల్లీలోకి 13, 14 రెండు, మూడు వార్డులకు సంబంధించిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ గల్లీకి అడ్డుగా ఆటోలు నిలిపి ప్యాసింజర్ల కోసం ఎదురు చూస్తుంటారు. వాహనాలు అడ్డంగా నిలపడంతో ఆ గల్లీలోకి రిక్షాలు, ద్విచక్రవాహనాలు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల నుంచి ఇళ్లకు వచ్చే పిల్లలు ప్రధానంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గల్లీలకు ఎదురుగా ఆటోలు నిలపకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులకు ఇస్తామన్న రూ 3 వేలు నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ కతిక శుక్లాకు వినతి పత్రం అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రూప్-1, 2 నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అంజిరెడ్డి, మరియబాబు, పి. సైదారావు, దయాకర్, అవి నాష్, హర్షవర్ధన్, డి.గోపి, యు.రాజు, కొయ్య శీను పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యేసుతో సహవాసం గ్రూపు సభ్యురాలైన కర్రీ సంతోష లక్ష్మి ఆమె తల్లి జ్ఞాపకార్థం ఈరోజు పట్టణంలోని శ్రీ సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆహారం, బ్రెడ్‌ను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్ మాట్లాడుతూ గ్రూపును నడిపిస్తున్న జాన్‌వెస్లీని, స్థానిక పాస్టర్ ప్రసన్నబాబును, వృత్తి రీత్యా విదేశాలలో ఉన్నప్పటికి అన్నదానానికి ఆర్థిక సహకారం అందించిన సంతోష్ లక్ష్మిని అభినందించారు. నిర్వాహకులు అమీనా సేవలు మరువలేని అన్నారు. కార్య క్రమంలో భగత్ సింగ్ పాల్గొన్నారు.

నీటి కాలుష్యం వల్లే... అంటు వ్యాధులు

డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్

ప్రజాశక్తి - మంగళగిరి

వర్షాలు విపరీతంగా కురవడం వల్ల కొరవడం వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధక్షులు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీటి నివారణకి పలు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు విపరీతంగా పడుతున్నాయి. కురుస్తున్న వర్షాల వల్ల నీటి కాలుష్యం జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మంచినీటి వసతులే కాకుండా డ్రైనేజ్ కాలువలు, చెరువులు నీటి కుంటలు ఇలాంటివన్నీ పొంగడంతో మంచినీటి కాలుష్యం జరిగే అవకాశం ఉందని చెప్పారు. చాలా వరకు నీరు మురుకులుగా వస్తున్నాయని, అంటూవ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. గత రెండు మూడు నెలలుగా వర్షాలు బాగా పడటం వలన చాలా మందికి విష జ్వరాలు, కొంత మందికి పచ్చకామెర్లు, మరి కొంతమందికి టైఫాయిడ్ జ్వరాలు డెంగ్యూ జ్వరాలు అలాంటి వస్తున్నాయి. మలేరియా ప్రబలుతూ ఉన్నదని కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు ప్రభుత్వాలకి సూచనలు చేసిందని చెప్పారు. దోమ కాటు వలన, క్రిమి కీటకాల వలన ఎక్కువగా వస్తూ ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో అక్కడక్కడ వ్యాధులు సోకుతున్నట్టుగా చెప్పారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కలరా, అతిసార వ్యాధితో అడ్మిట్ అయినట్టుగా తెలుస్తుంది. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రత్యేకమైన కలరా వార్డుని ఏర్పరిచి దాంట్లో కలరా సోకిన వ్యాధిగ్రస్తుల్ని ట్రీట్మెంట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం ఇది నీటి కాలుష్యం వల్ల వస్తున్నదిగా భావించాలి అని చెప్పారు. అంతే కాకుండా బయట ఈగలు ముసిరిన పదార్థాలు తినటం, నిల్వ ఉన్న పదార్థాలు తినటం మూలాన ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. విరేచనాలు, వాంతులు గాని ఒకటి నుంచి పలుమార్లు అవచ్చని, కొంతమందికి ఒక విరోచనం ఒక వాంతితోనే స్పృహ కోల్పోయి, నీరసపడి నిస్సత్తుగా ఆయి, వైద్యశాలలో చేరాల్సిన అవసరం రావచ్చని, కొంతమందికి ప్రాణహాని కూడా జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి గాని లేక మంచి వైద్యుని దగ్గరికి గాని వెళ్లాలని సూచించారు. ప్రజలు పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి, చద్ది ఆహారం తినకూడదు, మాంసాహారం తగ్గించుకోవాలి, బయట ఆహారం తీసుకోవటం మానాలి, ముఖ్యంగా ఈగలు ముసురుతున్న ఆహార పదార్థాలు తినకూడదు. చేతులు శుభ్రంగా తినే ముందు వాష్ చేసుకోవాలి, కాచి చల్లార్చుకుని తాగాలని సూచించారు. మన ఆహార పదార్థాల దగ్గర ఈగలు ముసలకుండా చూసుకోవాలి. నీరు నిలబడకుండా చూసుకోవాలి. డ్రైనేజీలు సరిగా ఉన్నాయో లేవో చూసుకోవాలి, కుళ్ళిన ఆహార పదార్థాలను తగురీతిలో డిస్పోస్ చేయాలి. ప్రభుత్వం వైపు నుండి నీరు నిలవకుండా చూసుకోవాలి, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచుకోవాలి, తరచుగా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వ్యాధి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కలరా వ్యాక్సిన్ వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

ప్రజాశక్తి - పెదకాకాని

దసరా ఉత్సవాలలో భాగంగా స్థానిక పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించారు.

రైతులకు ఈ- క్రాప్ లోన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పిఎసిఎస్ కార్యాలయంలో బుధవారం రైతులకు క్రాప్ లోన్లు, క్యాష్ క్రెడిట్ కి సంబంధించిన 22 లక్షల 80 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పిఎసిఎస్ చైర్ పర్సన్ గాదే పిచ్చిరెడ్డి మాట్లాడుతూ మంగళగిరి పిఎస్‌సిఎస్ పరిధిలో తొమ్మిది గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో రాయల రమేష్ బాబు, డైరెక్టర్స్ అందే శివశంకరరావు, వాస వేణు కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి ప్రేమ్ రాజ్

జాతీయ సేవా దినోత్సవం వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గల వి.టి.జే.ఎం & ఐ.వి.టి.ఆర్ డిగ్రీ కాలేజ్‌లో బుధవారం జాతీయ సేవా పథకం దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఇంగ్లీష్ అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్ అధికారి యర్రగుంట్ల ప్రేమ్ రాజ్ అధ్యక్షత వహించారు. సెక్రటరీ, కరస్పాండెంట్ వి. తాతారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ సమాజం అవసరాలు, సమస్యలను గుర్తించి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా విషయాలను కోరారు. సామాజిక, పౌర బాధ్యతల భావనను పెంపొందించుకోవాలి విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ అందరూ సంఘంలో భాగస్వాములు అని చెప్పారు. సమ సమాజ నిర్మాణానికి పాటుపడాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొల్లిపర

సిపిఎం నాయకులకు సమస్యలు విన్నవించుకుంటున్న కాలనీవాసులు

కొల్లిపర శివారు గుదిబండివారిపాలెం జగనన్న కాలనీలో రోడ్లు లేకపోవడం వల్ల వర్షాలకు ప్రజలు పడుతున్న బాధలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. భావన్నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జగనన్న కాలనీని ఆయనతో పాటు సిపిఎం తెనాలి ఏరియా నాయకులు ములకా శివసాంబిరెడ్డి పరిశీలించారు. కాలనీ ప్రజలు తమ సమస్యలను సిపిఎం నాయకులకు విన్నవించారు. పొలంలో కాలనీ నిర్మించడంతో నడకదారి లేదని, కాలనీ మొత్తం నీటిమడుగుగా ఉందని, పాములు, క్రిమీ కీటకాలు సంచరిస్తూ ప్రాణాంతకంగా ఉన్నదని ప్రజలు చెప్పారు మురుగునీరు పారేందుకు కాలువ లేకపోవడం వల్ల దోమలు వ్యాపించి అనారోగ్య పాలవుతున్నామని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో గడ్డి విపరీతంగా పెరిగి తీవ్ర అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని రోడ్లు మురుగు కాలవలు పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చెందోలు పద్మ, షేక్ రమీ జాబి సొంటి శివ నాగదుర్గ, ముద్రబోయిన నాగరాజు, దుర్గాభవాని, వల్లభాపురం శ్రీనివాసరావు, సయ్యద్ రీహానా తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు ఉద్యమించాలి : కేసన

ప్రజాశక్తి -మంగళగిరి

యువజన సంఘ సభ్యులతో కేసన

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగాన్ని బాపట్ల జిల్లాలో అన్ని నియోజకవర్గాలు-మండలాలలో కమిటీలను వేసి, సంఘ నిర్మాణ పటిష్టత-విస్తృత కోసం, బీసీల హక్కుల సాధన లక్ష్యాలతో ఉద్యమించాలని రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. బుధవారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా బీసీ సంఘ నాయకులు, కుల సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ నాయకత్వం వహించారు. బాపట్ల జిల్లా అధ్యక్షులు పచ్చబట్ల గంగరాజు ప్రోత్సాహంతో పలువురు యువజన నాయకులు నియామక పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాపట్ల జిల్లాలోని అన్ని స్థాయిలలో సంఘ నిర్మాణం పూర్తి చేసి,గ్రామ గ్రామాన బీసీ జెండాలు ఎగిరేలా కృషిచేయాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ, యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ గంజాయి కోకైన్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల జోలికి పోకుండా, యువతను చైతన్యపరిచి సంఘ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులుగా పి.డోల శివకుమార్, చీరాల నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా విన్నకోట జగదీష్, చీరాల నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శిగా గోసాల శ్రీను,రేపల్లె నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శిగా చెన్ను పోతురాజు, చెరుకుపల్లి మండల యువజన అధ్యక్షులుగా పులిమి జానకిరామయ్య, భట్టిప్రోలు మండల యువజన అధ్యక్షులుగా జగ్గారపు పాపారావులు నియామక పత్రాలను స్వీకరించారు. సమావేశంలో తిరువీధుల కిరణ్, ధనుంజయ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి కంపెనీ ప్రతినిధులను పరిచయం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఈ అవకాశాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 40 మంది అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అభ్యర్థులకు రాత, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించగా, ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 1వ తేదీ నుండి విధుల్లో చేరనున్నారని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి గారు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నెలాఖరుతో ఈ పంట నమోదు ముగింపు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఖరీఫ్ సీజన్ ఈ పంట నమోదు కార్యక్రమం ఈనెల 30 తేదీతో ముగుస్తుందని, రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు ఈ పంట నమోదు కార్యక్రమంలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు కోరారు. మండలంలోని రేవేంద్రపాడు, మొరంపూడి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులు అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసి ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శ్రమదానంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

శ్రమదానం కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ కోరారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం పక్షోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాతలా కుల వద్ద ఉన్న పార్కులో శ్రమదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.వివేకానంద మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రముఖులు ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'ఈ' పంట నమోదుపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

కౌలు రైతు కార్డుల ప్రాముఖ్యత, ఈ పంట నమోదుపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి.ప్రియదర్శిని కోరారు. బుధవారం చేబ్రోలు,వడ్లమూడి రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కౌలు రైతులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులు తీసుకోవాలని, అవి ఉంటేనే ప్రభుత్వ వ్యవసాయ సబ్సిడీ పథకాలు పొందవచ్చు అన్నారు. రైతులు వేసిన పంటల గురించి 'ఈ 'పంట నమోదు చేసుకోవాలన్నారు. క్రాప్ ఇన్స్యూరెన్స్, వరిలో వచ్చే తెగుళ్లు, కలుపు నివారణ పై అవగాహన కల్పించమన్నారు. యూరియా తగు మోతదులో వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి

వాతావరణం లో మార్పులు, భారీ వర్షాల కారణంగా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ పి శ్రీకాంత్ కోరారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. పురపాలక సంఘ పరిధిలో ఇంటింటికి కొళాయిల ద్వారా సరఫరా చేసే మంచినీరు రంగు మారినా, నీరు వాసన వచ్చినా, ఎక్కడైనా పైపులైను లీకేజీలు గమనించినా తక్షణమే పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్18004256468 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నృత్యప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

కిట్స్ అక్షర్ కళాశాలలో స్వాగత వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

యనమదలలోని కిట్స్ అక్షర్ ఇంజినీరింగ్ కాలేజీలో బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. వేడకల ప్రారంభం కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ కోటయ్య పాల్గొన్నారు. కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యతోపాటు ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇండస్ట్రీలకు కావాల్సిన నూతన నైపుణ్యాలను కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. శేఖర్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులు కలిసి మెలిసి స్నేహ పూర్వకమైన వాతావరణంలో మంచి విద్యను నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో అతిథులు, ప్రిన్సిపాల్

టిజెపిఎస్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది స్వదీప్తి తేరా, ఆస్ట్రేలియన్ డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చలపతి పాల్గొని ప్రసంగించారు. స్వదీప్తి తేరా మాట్లాడుతూ విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని కోరారు. డాక్టర్ చలపతి మాట్లాడుతూ మానవ శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే చక్కటి ఆహారం మనం ఏవిధంగా తీసుకుంటామో, సమాజం చక్కగా, సంతోషంగా ఉండాలంటే మన వంతు పాత్ర కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది టి.శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు.వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్ కామేశ్వరశాస్త్రి, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్.జయశైలజ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్సిసి క్యాడెట్లతో ఎన్సిసి కమాండెంట్, ప్రిన్సిపాల్

మలినేనిలో ఎన్సిసి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో 22(ఎ) బెటాలియన్ తెనాలి వారి అనుబంధంతో ఎన్సిసి కొత్త యూనిట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కమాండింగ్ ఆఫీసర్ ఎ.ఉదయ్‌కుమార్ పాల్గొని ఎన్సిసి పతాకాన్ని ఆవిష్కరించారు. కొత్తగా ఎంపికైన ఎన్సిసి క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలిని పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్సిసి వంటి సంస్థల్లో చేరటం ద్వారా క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్ జె.కిషోర్‌బాబు, ఎన్సిసి కేర్‌టేకర్ జె.ప్రవల్లిక, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ జెసిలో కర్మణ్యే వాధికారస్తే చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులను ఆలోచింపచేసే ఒక సస్పెన్స్, ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ, థ్రిల్లర్ సినిమా 'కర్మణ్యే వాధికారస్తే' చిత్రం అని దర్శకులు అమర్‌దీప్ చల్లపల్లి అన్నారు. ఉషస్విని ఫిలిమ్స్ పతాకంపై డిఎస్ఎస్ దుర్గాప్రసాద్ నిర్మాణంలో, హీరో హీరోయిన్‌లుగా కష్ణభట్, ఇరా దయానంద్, అయేషా, రెహానా ఖాన్‌లను నూతన పరిచయం చేశారు. బ్రహ్మాజీ, శత్రు, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన పాత్రల్లో, బెనర్జీ, పథ్వీ, శివాజీ రాజా, అజయ్ రత్నం, శ్రీసుధా ముఖ్య పాత్రల్లో నటించిన 'కర్మణ్యే వాధికారస్తే' చిత్రం అక్టోబర్ 1 సినిమా థియేటర్లలో ప్రేక్షకుల ముందు రానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర యూనిట్ కళాశాలను సందర్శించింది. చిత్ర యూనిట్ విద్యార్థులతో మాట్లాడి వారి అనుభవాలను పంచుకున్నారు.వారితో కలిసి నత్య ప్రదర్శన చేసి కళాశాల ఆవరణలో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్,అధ్యాపకులు పాల్గొన్నారు.

మేడి కొండూరు

ఎన్ఆర్ఐ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటం వల్ల మేడికొండూరులోని ఎన్నారై కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తోందని, బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఫీజులు చెల్లించకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోమని, అలాగే ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులు నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. పవన్ కుమార్, ఎస్.కె. సమీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని మండిపడ్డారు. రాష్ట్రంలోనే ఎమ్మెల్సీగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ కళాశాల యాజమాన్యంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను మానసికంగా వేధిస్తూ, ఫీజులు కట్టమని వత్తిడి చేస్తోందని ఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. ఫీజులు చెల్లించకపోతే ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేస్తామని, మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తూ విద్యార్థులను భయపెడుతున్నారని అన్నారు. ఈ చర్యలు విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్రమైన నష్టం కలిగించేవిగా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మరియు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి విద్యార్థులకు అండగా నిలవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎ. యశ్వంత్, జిల్లా గరల్స్ కన్వీనర్ సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు అభి తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఎత్తిపోతలను సందర్శించిన పల్నాడు కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల జలపాతాన్ని బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సందర్శించారు ఎత్తిపోతల్లోని 70 అడుగుల ఎత్తు నుండి జాలువారుతున్న నీటి బిందువులను తిలకించారు. టూరిజం శాఖ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పర్యాటకులను వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగార్జున్ సాగర్ సమీపంలోని ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ కేంద్రాన్ని సందర్శించారు అకాడమీ కెప్టెన్ మమతాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట రెవెన్యూ అధికారి మురళి, మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్, దత్తు బ్రహ్మం యాదవ్, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు కోరారు. పంచాయతీ వర్కర్ల సమస్యలపై బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా జీతాలు పెరగకపోవటం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జూన్ 20 నుండి గ్రీన్ అంబాసిడర్లకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ రూ.4వేలతో కలిపి రూ.10వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఏ ఒక్క పంచాయతీలో అమలు కావట్లేదన్నారు. ఏప్రిల్ చివరి నాటికి పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియ చాలా పంచాయితీల్లో పూర్తి కాలేదన్నారు. దీంతో కార్మికులు జీతాలు పెంచుకునే అవకాశం కోల్పోతున్నారని చెప్పారు. టెండర్ రెన్యువల్ పేరుతో సెక్రెటరీలు ఒక్కో కార్మికుడి నుండి రెండు వేల నుండి మూడువేల రూపాయాలు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఒకే విధమైన పనిచేస్తున్నా మున్సిపల్ కార్మికులకూ, పంచాయతీ కార్మిలకు వేర్వేరుగా జీతాలు ఉన్నాయని చెప్పారు. పంచాయతీ ఆదాయంతో ముడిపెట్టి కార్మికుల జీతాలు నిర్ణయించటం సరికాదన్నారు. నిత్యం మురికి కూపంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. కొబ్బరి నూనె, గ్లౌజులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, ప్రమాదమీబా రూ.10 లక్షలు ఇవ్వాలని, చనిపోతే దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో నూతక్కి వీరయ్య, ఎన్.రత్నకుమారి, ఎం.అంజమ్మ, పి.మేనకరావు, ఎన్.రమణమ్మ, ఎం.నరసింహారావు, పి.మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిపిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

చలమయ్య కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కాలేజిలో బుధవారము ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేయటమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని చెప్పారు. నేటి యువతకు విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత, సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.శ్రీధర్, వై.చంద్రశేఖర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులను ప్రిన్సిపాల్ సన్మానించారు.కార్యక్రమంలో సుభద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ టి.సంధ్య మాట్లాడుతూ అన్ని దానాలలో రక్తదానం గొప్పదని, ఇంకొకరి ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు రక్తదాన శిబిరంలో 20 యూనిట్లు రక్తం దానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐ.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరిరెడ్డి, , రెడ్‌క్రాస్ టీమ్ జానీరసూల్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు